# సింగిల్ పేజీ కథలు

"నాన్సెన్స్! ఈ కంప్యూటర్ యుగంలో కూడా దయ్యాలు మంత్రాలు. వీటిని మీరెలా నమ్ముతున్నారో. మిమ్మల్ని చూస్తే నవ్వాలో, ఏడ్వాలో అర్థం కావడం లేదు" సీరియస్‌గానే మాట్లాడాడు కమలాకర్.

"ఏమిరా! గ్రామదేవతను పోలేరమ్మను, నన్నే మరచిపోతార్రా. మిమ్మల్ని విడిచిపెట్టను. మీ అంతు చూస్తానురోయ్" గుడిలో పూజారి ఊగిపోతున్నాడు.

చిన్న పల్లెటూరు నామాల. ఎటు వెళ్లినా కనీసం పది కిలోమీటర్లు నడిస్తేగానీ మరో ఊరు చేరలేం. దేశమంతా బాగుపడింది కానీ నామాల గ్రామం మాత్రం అభివృద్ధికి దూరమై ఏ అదృష్టానికి నోచుకోని అనాథ శిశువులా ఉంది.

టీచరు వచ్చినపుడు మాత్రం వాకిళ్లు తెరిచే ఎలిమెంటరీ స్కూలు, ఊరి మధ్యలో శివాలయం, ఊరి చివరన పోలేరమ్మ గుడి. జంబులింగం, గోదారయ్య, పూజారి బసవయ్య వీరే గ్రామ పెద్దలు. తుమ్మాలన్నా, దగ్గాలన్నా వీరినడగాల్సిందే. ఎవరిండ్లలో వారు తినాల్సిందే కానీ పని చేయాల్సింది మాత్రం వీళ్లకే. ఊరిలో తగువులు పెట్టేది వీళ్లే. తర్వాత తగవులు తీర్చేది వీళ్లే. రోగమొచ్చిందంటే పూజారి బసవయ్య ఇచ్చే బూడిదే మందు. ఊరిజనాలు జంబులింగం వేసే తాయెత్తులు మోయక తప్పదు. అడిగిన దక్షిణలు సమర్పించుకోక తప్పదు. కాదు కూడదంటే శివయ్య మూడో కన్ను తెరుస్తాడు. పోలేరమ్మకు పూనకం వస్తుంది. ఇదండి నామాల గ్రామ పరిస్థితి.

కమలాకర్ ఆ ఊరికి కొత్తగా వచ్చిన టీచరు. ఊరి ప్రజల అమాయకత్వాన్ని చూస్తుంటే వారింకా అనాది యుగంలో ఉన్నారనిపిస్తోంది. జంబులింగం, గోదారయ్య, బసవయ్యలు ఆ ఊరిని పాలించే దుష్ట త్రయ గ్రహాలని తొందరగానే గ్రహించాడు కమలాకర్. శివుడి ఆజ్ఞ లేకున్నా చీమకుట్టవచ్చును కాని దుష్ట త్రయం అనుగ్రహం లేనిదే ఆ ఊరిలో ఏ పని జరుగదు. ఆ ఊరి ప్రజలను మార్చాలని కమలాకర్ చేసే ప్రయత్నాలు ఫలించడం లేదు.

"ఆ టీచర్ మనూరొచ్చినప్పటి నుంచి మన రాబడి తగ్గిపోతోందయ్యా. ఏమంటావ్ గోదారయ్యా" అడిగాడు జంబులింగం.

"ఆ టీచర్ని మనూళ్లో నుంచి ఎళ్లగొట్టకపోతే మన పని గోవిందా" అన్నాడు గోదారయ్య. వంత పాడాడు బసవయ్య.

★ ★ ★


"పూజారయ్యా! మా నర్సిగాడికి వళ్లంతా ఒకటే దురద. పైగా వాంతులు, విరేచనాలు. మనిషి మెలికలు తిరిగిపోతున్నాడు. తమరే కాపాడాలి." తెల్లవారుజామునే బసవయ్య ఇంటి ముందు జనం మూగారు.

"జై పోలేరమ్మ తల్లీ" అంటూ అందరికీ విబూది

## దోపిడీ

ఇచ్చాడు బసవయ్య.

ఇంకా రోగి ముఖాన విబూది పూయనే లేదు ఏడుస్తూ గుంపులు గుంపులుగా జనం వస్తూనే ఉన్నారు. పదిమంది దాకా రోగులు చేరారు. వళ్లంతా



దురద. వాంతులు, విరేచనాలు. అందరిదీ ఇదే సమస్య. ఇంతలో జంబులింగం అక్కడికి చేరాడు. జంబులింగాన్ని చూస్తూనే ఊగిపోసాగాడు బసవయ్య. అందరినీ గమనిస్తూనే ఉన్నాడు కమలాకర్.

"అమ్మా! పోలేరమ్మతల్లీ! నీ బిడ్డల్ని కాపాడమ్మా!" చేతులు జోడించి ప్రార్థించాడు జంబులింగం. "ఏదో దుష్టశక్తి ఊర్లోకి వచ్చి చేరిందిరోయ్. చెప్పుడు మాటలు విని చెడిపోకండి. వెంటనే వీళ్లందరినీ పట్నానికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడండిరోయ్" అరుస్తూ కింద పడిపోయాడు బసవయ్య. బిందెడు పసుపునీళ్లు బసవయ్యపై పోశారు. నవ్వుకున్నాడు కమలాకర్.

"రాజన్నా! ఈ మాటిన్నావా? సూరిగాడికి అమ్మోరు కల్లోకొచ్చిందంట. బలులిచ్చి జాతర చేయాలంట. ఆ విసెం సెప్తే అందరి పానాలు తీత్తానందంట."

"మనూరికెంత కట్టవొచ్చింది రామేసు మామా. పొద్దుగూల మరో ఆరుగురు ఆస్పత్రికెళ్లినారట."

"ఏదో సీమ కాటేసినట్టయిందటరా. ఎంటనే దద్దుర్లు, వాంతులు, యిరేచనాలట. అంతా పోలేరమ్మ తల్లి మయిమ."

ఊరంతా ఎవరిని కదిలించినా ఇలాంటి మాటలే వినిపిస్తాయి.

"మీరు చూశారా" అంటూ అందరినీ అడుగుతూనే ఉన్నాడు కమలాకర్. ఒకరిపై ఒకరు చెబుతున్నారే కానీ కచ్చితంగా ఎవరూ చెప్పడం లేదు.

రెక్కలు కట్టుకొని నామాల గ్రామంలో వచ్చి వాలింది వైద్య బృందం.

ఇల్లిల్లు తిరిగి మందులు అందించారు. "మళ్లీ నలుగురికి యిరోచనాలయ్యాయి బాబూ. మీకు చూపించండని చెప్పినా యినకుండా పట్నమెళ్లారు" ఇలాంటి మాటలు ఎవరో ఒకరు చెబుతూనే ఉన్నారు. కానీ ఎలాంటి కొత్త కేసులు వారికి కనిపించలేదు.

మొదట పట్నమెళ్లిన పదిమంది ఆరోగ్యంగా తిరిగొచ్చారు.

"ఏదో విషాహారం తిన్నందువల్లనే ఇలా జరిగింది కానీ, ఏ దుష్టశక్తులు మీ ఊరిలోకి రాలేదు. మీరు ధైర్యంగా ఉండండి" ప్రజలకు ధైర్యం చెబుతున్నారు వైద్యులు. రోగలక్షణాలు కన్పడ్డ ముందు రోజు ఏం జరిగిందో విచారణ చేపట్టారు.

గోదారయ్యకు పదెకరాల పొలముంది. బోరు వేయించి పంటలు పండిస్తాడు. పైరుకు పురుగు పట్టిందని చేనంతా మందు చల్లించాడు. ఆరోజు రాత్రే ఈ సంఘటన జరిగింది.

"తగిన జాగ్రత్త లేకుండా మందును చల్లారు. చేతులు సరిగా శుభ్రం చేసుకోకుండానే ఆహారం తిన్నారు. అందువల్లనే దద్దుర్లు వచ్చాయి. వాంతులు, విరోచనాలయ్యాయి అంతే." తేల్చి చెప్పారు వైద్యులు. ఆస్పత్రిలో చేరిన పది మంది క్రితం రోజు గోదారయ్య పొలంలో పనిచేసిన వారే.

"పరిశుభ్రంగా ఉండాలి. రోగాలొస్తే వైద్యుల దగ్గరకి వెళ్లాలి కానీ విబూది, తాయెత్తులు మానండయ్యా అంటే వినిపించుకోరు. ఇప్పుడు చూశారుగా నేను చెప్పిందే జరిగింది" అన్నాడు కమలాకర్.

"బలే చెప్పొచ్చావులేవయ్యా! నీ మాటలు విని మా ఊరోళ్లు ఇలా పీకలమీదికి తెచ్చుకున్నారు. నీ చదువేదో నీవు చూసుకో. మా విషాయల్లో తలదూర్చావంటే ఊరి నుంచే తరిమేస్తాం జాగ్రత్త" కమలాకర్‌ను భయపెట్టారు దుష్టత్రయం.

రంగరంగ వైభవంగా జరిగింది పోలేరమ్మ జాతర. ముడుపులు కానుకలతో హుండీ నిండింది. జంబులింగం తాయెత్తుల బేరం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఏ మార్పులు లేకుండా మునుపటిలా ఉంది నామాల గ్రామం.

'డాక్టర్లు చెప్పినా నమ్మడం లేదు. ఊర్లో వచ్చిన వదం

తులన్నీ దుష్టత్రయం కల్పించినవే అని తెలుసుకోవడం లేదు. అసలు హుండీలోని కానుకలన్నీ ఏమయ్యాయని అడగడం లేదు. దుష్టత్రయం దోపిడీ మాత్రం యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. ఎంత మంచివారు నామాల గ్రామ ప్రజలు. ఇలాంటి దోపిడీని ఎవరూ అరికట్టలేరా? దైవమా నీవైనా మరోసారి అవతరించవా' అనుకుంటూ తరగతి గదిలోకి వెళ్లిపోయాడు కమలాకర్.

**-టి.రామాంజనేయులు**
**(హాలహర్వి)**

# రాజకీయం

"ప్రియమైన నా ప్రజలకు నమస్కారాలు. మరి ఈ సభకు విచ్చేసిన మీ అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుచున్నాను. మరి మీరందరూ కూడా మీ అమూల్యమైన ఓటును నాకే వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నాను. మరి ఈ గ్రామం అభివృద్ధి చెందాలంటే మరి ఈ వీధులన్నీ శుభ్రంగా పచ్చగా ఉండాలంటే మీ ఓటును మా పార్టీకే వేయాలని కోరుతున్నాను. మరి మన గ్రామమే కాదు ఈ రాష్ట్రం, ఈ దేశం బాగుపడాలంటే నేడు యువ నాయకత్వం అవసరం ఎంతైనా ఉంది. మరి ఈ సందర్భంగా మీ అందరికీ నేను సవినయంగా మనవి చేసేది ఏమిటంటే మీ ఓటును నాకే వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నాను. జైహింద్."

సుదీర్ఘంగా సాగుతున్న ఉపన్యాసం ఎంత వినకూడదనుకుంటున్నా నా చెవులకు వినిపిస్తూనే ఉంది. 'ఈ గొంతు ఎక్కడో విన్నట్లుందే' పైగా 'మరి' అనే ఊత పదం కూడా అనుకుంటూ సభ జరుగుతున్న ప్రదేశానికి వెళ్లాను. సభ జరుగుతున్న ప్రదేశం అంతా కోలాహలంగా ఉంది. నా ముందు ఉన్న జనాల్ని దాటుకుంటూ ముందుకు వెళ్లాను.

అప్పటి వరకూ మాట్లాడిన వ్యక్తిని చూసి నివ్వెరపోయాను. అతడు ఎవరో కాదు నేను డిప్లమో చదువుతుండగా అతడు నా క్లాస్‌మేట్. నారాయణ క్లాస్‌లో అందరితో స్నేహంగా ఉండేవాడు. అందరికన్నా నాతో ఎక్కువ స్నేహంగా ఉండేవాడు. అప్పట్లో నేను క్లాస్ ఫస్ట్.

మాది మధ్యతరగతి కుటుంబం అవ్వడం వలన సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో చదవడమే గగనం అయింది. నేను డిస్టింక్షన్‌లో పాస్ అయినా పై చదువులు చదివించడం నా వల్ల కాదన్నాడు నాన్న. అప్పటికే అక్క పెళ్లి చేసి కష్టాల్లో ఉన్నాడు. ఇంతలో చెల్లెలికి కూడా అనుకోకుండా మంచి సంబంధం కుదరడంతో తన పెళ్లి వ్యవహారాల్లో బిజీగా ఉన్న ఆయన్ని బి.టెక్ చదువుతానంటూ ఆగి ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక నేను కూడా నా కాళ్లపై నిలబడి నాన్నకు సహాయం చేయాలనుకున్నాను.

"ఏంటండీ ఆలోచిస్తున్నారు?" అంటూ కస్తూరి అడుగుతుంటే ఉలిక్కి పడి ఈ లోకంలోకి వచ్చాను. "మన నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీకి నిలబడిన నారాయణ ఎవరో కాదే నా బెస్ట్ ఫ్రెండ్. అతడు డిప్లమోలో నా క్లాస్‌మేట్" అని చెప్పాను ఉత్సాహంగా.


నారాయణ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాడు. ఈ శుభసందర్భంలో అతడ్ని అభినందించాలి అనుకుంటూ వాళ్ల ఇంటికి బయలుదేరాను. నేను రావడం గమనించి...నన్ను సాదరంగా ఆహ్వానించాడు.

"ఏం చేస్తున్నావ్‌రా? బాగున్నావా? నిన్ను చూసి చాలా కాలం అయింది!" అంటూ ప్రశ్నించాడు ఆప్యాయంగా.

"నువ్వు ఎలక్షన్స్‌లో నిలబడ్డావని తెలిసి నిన్ను కలవాలని రెండుసార్లు ఇంటికి వచ్చాను. నువ్వు ఇంటి వద్ద లేవు" అంటూ చెబుతున్న నా మాటలకు అడ్డు వస్తూ..

"ఎలక్షన్స్ కదా చాలా బిజీగా ఉన్నాను. నియోజకవర్గం అంతటా సుడిగాలిలా పర్యటించవలసి వచ్చింది" అన్నాడు.

మా కాలేజీ లైఫ్ గురించి, కాలేజీలో మేము చేసిన



అల్లర్ల గురించి మా ఫ్రెండ్స్ గురించి మా బాచ్‌లర్ లైఫ్ గురించి...ఇలా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాము.

చాలాసేపటి తరువాత అడిగాడు- "అన్నట్టు...అడగడం మర్చిపోయాను. ప్రస్తుతం నువ్వు ఏం చేస్తున్నావురా?"

"నేను ఈ సిటీలోనే సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానురా. సొంతంగా ఆఫీసు కూడా ఈమధ్యనే తెరిచాను" చెప్పాను

"అలాగా" అంటూ ఇంట్లోంచి వాళ్ల ఆవిడ్ని పిలిచి "వీడు నా స్నేహితుడు విశ్వనాథం. రాత్రికి మనింట్లోనే భోజనం చేస్తాడు" అంటూ చెప్పాడు.

"ఎందుకులేరా...ఇంటి దగ్గర మా ఆవిడ నా గురించి ఎదురుచూస్తూంటుంది" అంటూ వాచ్ చూసుకున్నాను.నేను ఇంటికి వెళ్లిపోతానంటూ ఎంతగా చెప్పినా...అతడు నా మాట వినకుండా నన్ను ఆగమంటూ బలవంతపెట్టాడు. ఆఖరికి అతడి మాటకే విలువనిస్తూ "సర్లేరా" అన్నాను.

వాడు చదువుల్లో యావరేజ్ స్టూడెంటే అయినా ఆస్తిపరులవ్వడంతో బి.టెక్ పూర్తి చేసి పై చదువుల నిమిత్తం రెండేళ్లు అమెరికా కూడా వెళ్లి వచ్చాడు.

అమెరికాలో వాడి స్నేహితుల గురించి వాళ్ల అలవాట్ల గురించి వాడు చెబుతుంటే ఆసక్తిగా విన్నాను.

"ఈమధ్య పేపర్లో సిటీ నుండి మన ఊరికి రోడ్ శాంక్షన్ అయిందని వచ్చిందిరా. త్వరలో టెండర్లు పిలుస్తారు. ఒకవేళ ఆ టెండర్ నాకే వస్తే ముందు ముందు నీ సహాయం కావాలిరా" అంటూ అడిగాను.

"తప్పకుండా" అన్నాడు.

నేను చేసే సివిల్ వర్క్స్ గురించి కొత్తగా వేసిన, వేయబోయే టెండర్ల గురించి అడిగాడు. అన్నిటికీ సమాధానాలు చెప్పాను.

నాలో చిన్న సందేహం... 'నేను చూసిన ఆ నారాయణ ఇతడు ఒకడేనా?'

"ఏంట్రా...ఏదో ఆలోచిస్తున్నావు?"

"ఎలా చెప్పాలాని?" నసిగాను.

"చెప్పరా...విశ్వనాథం"

"నేను కాలేజీలో ఉన్నప్పుడు పరిచయం అయిన నారాయణ ఇప్పుడు నేను చూస్తున్న నారాయణ ఒకరేనా అన్న సందేహంరా. అప్పుడు ఎంత అమాయకంగా ఉండేవాడివిరా! అస్సలు ఇన్ని తెలివితేటలు ఎలా సంపాదించావు?" నేను అడిగిన ప్రశ్నకు వాడు సంతోషంతో పొంగిపోతూ... చిరునవ్వులు చిందించాడు.

సిటీ నుండి మా విలేజికి రోడ్ శాంక్షన్ అయింది. టెండర్స్ పిలిచారా? మేము మంచి కొటేషన్ వేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు తప్పకుండా మాకే వస్తుందన్న ధీమా నాలో.

సమ్మర్ హాలిడేస్‌లో బెంగుళూర్ వెళదామంటూ పిల్లలు గోల చేయడంతో 'సరే' అన్నాను. 'బెంగుళూర్'లో మా శ్రీమతి వాళ్ల కజిన్ ఇంటికి చేరుకున్నాము. హాలీడేస్ అంతా అక్కడే ఉంటామని పిల్లలు అనడంతో నేను ఒక్కడినే తిరిగి వచ్చాను. ఆ రోజు.. ఆఫీసులో అడుగుపెడుతూ పి.ఎ.ని అడిగాను.

"మిస్టర్ శంకర్. రోడ్ గురించి మనం వేసిన టెండర్ ఏమయింది?""సార్. ఆ టెండర్ మనకు రాలేదు. రాజేశ్వరరావుకి వచ్చింది.".రాజేశ్వరరావ్ ఎవరో కాదు ఎమ్మెల్యే నారాయణరావుకు స్వయానా బావమరిది.

"సార్ అసలు ఈ టెండర్ మనకే రావల్సింది కానీ మనకు రాకుండా ఆ రాజేశ్వరరావుకి వచ్చేలా చేయడంలో ఎమ్మెల్యే నారాయణరావుగారి హస్తం ఉందని తెలిసింది."నా చెవులు వినడం మానేశాయి. ఆ క్షణంలోనే అర్థమయింది రాజకీయాల్లో స్నేహానికి విలువలేదని.

**-గొర్రెపాటి శ్రీను (హైదరాబాద్)**